క్లుప్తంగా

మురుగుతో ప్రజలకు ఇబ్బందులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని తాళ్ల గడ్డ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల నుంచి వచ్చే మురుగుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. మంగళవారం నాయకులతో పాఠశాల పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బాలికల హాస్టల్ నుంచి వచ్చే దుర్గంధం, వ్యర్థాల వల్ల దుర్వాసన వస్తుందని, స్థానికంగా ఉండే నివాస ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోడ్డు వెంట వెళ్లలేని దుస్థితి నెలకొందన్నారు. హాస్టళ్లకు మెంటనెన్స్ గ్రాంటు వస్తున్న సంబంధిత నిర్వాహకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఐటీడీఏ ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారులు స్పందించి మురుగుదొడ్ల నుంచి వచ్చే పైపులను మరమ్మతులు చేయించి గుంతలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలు



వెంకటాపురం(కె): మండల కేంద్రంలో మంగళవారం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర జన్మదిన వేడుకలు మున్నూరు కాపు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం భద్రాచలం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధనవనేని వెంకటేశ్వర్లు కేక్‌కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం నాయకులు బెజ్జని సత్తిబాబు, మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు జక్కుల శ్యామ్, కార్యదర్శి దాసరి నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు పడాల రమేశ్, కార్యదర్శి బాసాని రమేశ్, నాయకులు రంగయ్య నాయుడు, నాగరాజు, తోట శ్రీను, పంచాయతీ ఉప సర్పంచ్ దేవర కొండ ధనలక్ష్మి, జల్లిగంపల కళాధర్, లక్ష్మీపతి, సుభాషిణి, ఎంపీటీసీ గార్లపాటి రవి, బెతంచర్ల నాగరాజు తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహాముత్తారం/కాటారం: మహాముత్తారం, కాటారం మండలంలోని గంగారం మోడల్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 6 నుంచి 10వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్స్ రాము, మధు మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతిలో వంద సీట్లు, 7 నుంచి 10 తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. పూర్తి సమాచారం కోసం పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

ర్యాలీని సద్వినియోగం చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో చైన్నెలో ఫిబ్రవరి 3, 4వ తేదీల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రిక్రూట్మెంట్ అధికారి సజ్జ శ్రీ చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ బయాలజీ బ్యాక్ గ్రౌండ్ లేదా డిప్లొమా ఇన్ ఫార్మసీ, బీఎస్సీ నర్సింగ్ చేసిన పురుషులకు సంబంధించి నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 3న ఇంటర్ అర్హతగలవారికి, 4వ తేదీన డిప్లొమా, బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆన్‌లైన్‌లో లేదా 93453 77868 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

ఆధార్‌లింకు చేసుకోవాలి

కాళేశ్వరం: మండలంలోని ఉపాధిహామీ జాబ్ కార్డులకు ఆధార్‌కార్డులను లింకు చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ తెలిపారు. కాళేశ్వరంలో పీహెచ్‌సీని ఆయన మంగళవారం సందర్శించిన అనంతరం మాట్లాడారు. మండలంలో మొత్తం 12వేల వరకు జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. 88శాతం వరకు జాబ్ కార్డులు ఆధార్‌తో లింకు అయ్యాయన్నారు. మిగితా జాబ్‌కార్డుదారులు త్వరగా లింకు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ వసంత, ఉపాహమీ ఏపీఓ రమేష్ ఉన్నారు.

పనుల పరిశీలన

పలిమెల: మండలంలోని లెంకలగడ్డలో మన ఊరు–మన బడిలో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరీ పనులను ఎంపీడీఓ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యతతో పాటు వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

సన్మానం

చిట్యాల: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ డీలర్లు ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ సరిగోమ్ముల సమ్మయ్యను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రాజుతో పాటు డీలర్లు బోల్లెపల్లి దేవేంద్ర సాంబయ్య, బుర్ర సాదయ్య, త్రిలోకేందర్‌రెడ్డి, సదయ్య పాల్గొన్నారు.

దొడ్లలో ముస్తాబైన సారలమ్మ గుడి



కొండాయిలో నిర్మిస్తున్న షెడ్డు



ఐలాపురంలో జాతర నిర్వహించే ప్రాంతం



ముమ్మరంగా సాగుతున్న పనులు

- ఫిబ్రవరి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో మినీ జాతరలు
- ఐటీడీఏ నుంచి రూ.22.75 లక్షల నిధులు మంజూరు



విద్యుత్‌దీపాల స్తంభాల కోసం తవ్వుతున్న గుంతలు

ఏటూరునాగారం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో ఆదివాసీలు మినీ జాతరలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర అనంతరం వచ్చే ఏడాదిలో నిర్వహించే జాతరలే ఈ గ్రామీణ ప్రాంతాల జాతరలు. ఇందు కోసం కన్నాయిగూడెం మండలంలోని ఐలాపురం సమ్మక్క–సారలమ్మ జాతర, కొండాయిలోని గోవిందరాజులు, నాగులమ్మ జాతర, మల్యాల, దొడ్లలోని సమ్మక్క–సారలమ్మ జాతర కోసం ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఐటీడీఏ పీఓ అంకిత్ రూ.22.75 లక్షల నిధులు మంజూరు చేశారు. ఆయా పనులను స్థానిక సర్పంచ్‌లు, ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పనులు చేపట్టారు. ఫిబ్రవరి 1 నుంచి 4 వరకు జరిగే జాతరలకు వచ్చే భక్తుల సౌకర్యం కోసం నీటి వసతి, మరుగుదొడ్లు, రోడ్లు, గద్దెలకు రంగులు, చలువ పందిర్లు వేసేందుకు పనులు మొదలుపెట్టారు. మరో వారం రోజులే మిగిలి ఉండడంతో పనుల్లో వేగాన్ని పెంచాలని ఇప్పటికే పీఓ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈనెల 29లోపు పనులు పూర్తి చేసి భక్తులకు వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు నిమగ్నమై ఉన్నారు. ఐలాపురంలోని మినీ సమ్మక్క–సారలమ్మ జాతర కోసం రూ.8.25 లక్షలు, దొడ్లలోని సారలమ్మ, మల్యాలలోని సమ్మక్క గుడి వద్ద ప్రత్యేక ఏర్పాట్ల కోసం రూ.5.25 లక్షలు, కొండాయిలోని గోవిందరాజుల గుడి, నాగులమ్మ గుడితోపాటు జాతర వద్ద ప్రాంతంలో పనులకు గోవిందరాజుల రూ.9.25 లక్షల నిధులను కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే మినీ జాతరకు ఐటీడీఏ పీఓ అంకిత్ ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు కేటాయించడంపై ఆదివాసీలు, గిరిజనులు, వనదేవతల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఐలాపురం వెళ్లేందుకు దారిలో ఉన్న వాగులపై కూడా వాహనాలు నడిచే విధంగా తాత్కాలిక మరమ్మతులు చేయాలని ఆదివాసీలు, పూజారులు అధికారులను కోరుతున్నారు.

జాతరకు తరలిరావాలి



గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న మినీ జాతరతోపాటు, మేడారం మినీ జాతరకు భక్తులు తరలిరావాలి. ఆదివాసీలు ఆరాధ్య దేవతలుగా కొలిచే వనదేవతలకు భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవాలి. భక్తుల సౌకర్యం కోసం కావాల్సిన ఏర్పాట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ కృషితో చేస్తున్నాం. ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు ద్వారా చర్యలు చేపడుతున్నాం.

– వెంకటేశ్వర్లు, కొండాయి సర్పంచ్



కొండాయిలో ముస్తాబైన గద్దెలు



ముస్తాబైన గోవిందరాజుల, నాగులమ్మ గుడి



నీటి కోసం ఏర్పాటు చేసిన బోరు మోటారు

ఎరువుల బస్తాల పంపిణీ



ఎరువుల బస్తాలను అందజేస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సీఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా చొక్కాల, ఉప్పేడు, వీరాపురం గ్రామాలకు చెందిన సుమారు వంద మంది రైతులకు ఎరువుల బస్తాలను, వ్యవసాయ సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమెండెంట్ షహీద్ అలీ, ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ ఉన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌లు..



టై, బెల్ట్‌లు అందిస్తున్న సభ్యులు

ములుగు రూరల్: మండలంలోని జంగాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్ కొండి సాంబశివు అందించిన టై, బెల్ట్, బ్యాడ్జీలను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు చుంచు రమేశ్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థులకు సాయం చేసేందుకు లయన్స్‌క్లబ్ ముందుంటుందని అన్నారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మహేందర్ మాట్లాడుతూ.. పాఠశాల విద్యార్థులకు సాయం అందించిన లయన్స్‌క్లబ్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు సుబ్బారెడ్డి, రవిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గరంగరంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాస్



అధికారులను సమస్యలపై నిలదీస్తున్న సర్పంచ్ ఈర్ప సునీల్

ఎస్‌ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గొంది వాణిశ్రీ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం గరంగరంగా సాగింది. శాఖల వారీగా అధికారులు అభివృద్ధి పనుల నివేదికను చదివి వినిపించారు. ఏఓ పోరిక జయసింగ్ వ్యవసాయ శాఖ కార్యక్రమాలు వివరిస్తుండగా రైతు బంధు డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అయిన బ్యాంకు అధికారులు బకాయిల పేరుతో అకౌంట్లు హోల్డ్‌లో పెడుతున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని సభ్యులు కోరారు. ట్రాన్స్‌కో ఏఈ వేణుకుమార్ విద్యుత్ అభివృద్ధి పనులను వివరిస్తుండగా సర్పంచ్ ఈర్ప సునీల్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా విద్యుత్ సమస్యను ఏఈ దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోవడం లేదని ఆవేదన వెల్లిబుచ్చారు. తాడ్వాయి, కొండపర్తి గ్రామాల్లో విద్యుత్ తీగలు కిందికి వెలాడి ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని సరి చేయాలని పలుమార్లు మండల సభలో అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఇప్పటి వరకు ఎక్కడి సమస్య అక్కడే మిగిలిపోయిందన్నారు. స్థానిక సర్పంచ్‌గా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోలేదని మండల సభ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాసేపు మండల సభలో విద్యుత్ సమస్యపై చర్చ జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అందుబాటులో ఉండి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని సర్పంచ్‌లు కోరారు. కాగా తహసీల్దార్ శ్రీనివాస్ సివిల్ సప్లయి విభాగానికి సంబంధించిన వివరాలను వివరించారు. బ్యాంకు అధికారులు 60 సంవత్సరాలు దాటిన రైతులకు క్రాప్‌లోన్ ఇవ్వడం లేదని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా రైతుల క్రాప్‌లోన్ ఇవ్వడంలో ఎలాంటి వయస్సు పరిమితి లేదని, ఒకే పట్టా నెంబర్‌పై రెండు లోన్ ఇవ్వడం వీలు కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్, కో ఆప్షన్ మెంబర్ ఎండీ దిల్వర్‌ఖాన్, వైద్యాధికారి రణధీర్, పీఆర్ ఏఈ భిక్షపతి, ఎంపీటీసీ రవికుమార్, జయమ్మ, సర్పంచులు,అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మాట్లాడుతున్న లక్ష్మణ్

ఏటూరునాగారం: చిన్నబోయినపల్లి నుంచి ఐలాపురం వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల కమిటీ అధ్యక్షుడు కోకిల బాలు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్నబోయినపల్లి నుంచి కొండాయి వరకు రోడ్డు సక్రమంగా లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొండాయి వాగులోని బ్రిడ్జి కూలిపోయే దశకు చేరిందన్నారు. వర్షాకాలం సమయంలో ఐలాపురం, కొండాయి వాగులు దాటనించే పరిస్థితి ఉండటం లేదన్నారు. రోడ్లు, బ్రిడ్జి మరమ్మతులు చేసి గిరిజన గ్రామాల ప్రజల కష్టాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవితేజ, స్వామి, శివకేశవ, సాంబమూర్తి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

వాజేడు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. మండల పరిధిలోని కొంగాల గ్రామ సమీపంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కొంగల జట్టుకు రూ.30,000 నగదుతో పాటు షీల్డ్‌ను, రన్నరప్ జట్టు జగన్నాథపురానికి రూ.20,000 నగదు షీల్డ్‌ను ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు పొదెం వీరయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుమూల గ్రామంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం హర్షనీయమన్నారు. పోటీల్లో గెలుపు ఓటములు సహజమని ఓటమి చెందిన వారు కుంగిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం(కే) సీఐ శివప్రసాద్, సీఆర్‌పీఎఫ్ డీఎస్పీ సతీష్ కుమార్, ఎంపీపీ శ్యామల శారద, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత, నాగారం పంచాయతీ సర్పంచ్ తల్లడి ఆదినారయణ, తహసీల్దార్ గూడూరు లక్ష్మణ్, సెకండ్ ఎస్సై లతీఫ్ నిర్వాహకులు సతీష్, అఖిల్, తరుణ్, వెంకటేష్, నగేష్, డానీ, శ్రీధర్, రాకేష్ ఉన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న సీఐ శివప్రసాద్

వెంకటాపురం(కె): గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సీఐ శివప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ఆలుబాక పంచాయతీ ముత్తారంలో మంగళవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని సోదాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. గ్రామంలో నెలకోని ఉన్న సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోకి అపరిచిత వ్యక్తులు ఎవరైన వచ్చినట్‌లైతే వారి సమాచారాన్ని తక్షణమే పోలీసులుకు తెలుపాలని అన్నారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గ్రామంలో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ రంగాల్లో కావాల్సిన సహాయ సహకారాలను అందించేందుకుపోలీసులు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

కార్మికులకు పదోన్నతులు



పదోన్నతి పత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మల్హర్: మండలంలోని ఏఎమ్మార్ కంపెనీ ఆధ్వర్యంలో తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్‌లో పని చేస్తున్న అర్హులైన 69 మంది కార్మికులకు పదోన్నతులు లభించినట్లు మైన్ వైస్ ప్రసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు కాపురంలోని మైన్ క్యాంప్ కార్యాలయంలో పదోన్నతులు పొందిన కార్మికులకు ప్రభాకర్‌రెడ్డి పదోన్నతి పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదోన్నతులు పొందిన కార్మికులను మునుముందు కూడ క్రమశిక్షణలతో పని చేస్తూ, బొగ్గు ఉత్పత్తి పెంచడంలో కృషి చేయాలని సూచించారు. అలాగే ఇతర కార్మికులు కూడా క్రమశిక్షణలతో పని చేసి పదోన్నతులకు అర్హులు కావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మైన్ మేనేజర్ కేఎస్‌ఎన్ మూర్తి, డీజీఎం హెచ్‌ఆర్ రవికుమార్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి



మహదేవపూర్: కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కొమురయ్య



కాళేశ్వరంలో..

మహదేవపూర్: ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొమురయ్య అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు కేంద్రం నిర్వహణ, సర్పంచ్ శ్రీపతిబాపు పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. దీర్ఘకాలిక కంటి వ్యాధులకు పరిష్కారంగా కంటి వెలుగు శిబిరాలు ప్రజలకు మేలు చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య బృందం, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని సర్పంచ్ మండల లతారెడ్డి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని పరీక్షలు చేయించుకొని అద్దాలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడారు. కంటివెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సురేష్, మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేణు, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కాళేశ్వరం: రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడత కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్ నాయక్ నాయక్ అన్నారు. మంగళవారం ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఫిబ్రవరి 3 వరకు కంటి వెలుగు కార్యక్రమం జరుగుతుందని పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలు తరలి వచ్చి కంటి పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారి సుస్మిత, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ మమత, కంటి వెలుగు ఇన్‌చార్జ్ రవి, కార్యదర్శి సత్యనారాయణలు ఉన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని ధర్నా

చిట్యాల: పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఏసీడీ పేరిట పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఒక సంవత్సరంలోనే అనేకసార్లు కరెంటు బిల్లులను పెంచి సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. పెంచిన చార్జీలను వెంటనే తగ్గించాలని, లేదంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని అన్నారు. అనంతరం విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మూల శంకర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండల అధ్యక్షుడు మెరుగు లక్ష్మి, దివ్యాంగుల చైర్మన్ కొడారి సారయ్య, ఎంపీటీసీ అనిల్, ఎస్సీ సెల్ నాయకుడు రవి, చిట్యాల టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్, నాయకులు రాయ కొమురు, శ్రీనివాస్, దొడ్డి కిష్టయ్య ఉన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి

చిట్యాల: పద్మశాలీ కులదైవమైన మార్కండేయ జయంతిని మండలకేంద్రంలో పద్మశాలీ వీవర్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు ఈగ కోటేశ్వర్, పద్మశాలీ సంఘం చిట్యాల మండల అధ్యక్షుడు కట్కూరి నరేందర్‌లు మార్కండేయ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులు, బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి చింతకింది శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సామల రమేష్, సహాయ కార్యదర్శి సామల ధనుంజయ, కోశాధికారి సామల రాజేందర్, ఆడిట్ సభ్యుడు చిప్ప విశ్వనాథ్, సంఘం సభ్యులు నాగుల రమేశ్, క్యాతం మార్కండేయ, చింతకింది దశరథం, సామల కష్ణస్వామి, సామల యాదగిరి, లకుమ్ చంద్రమౌళి, దొంత శ్రీనివాస్, తాళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.